సాక్షి తిరుపతి

మంగళవారం । 10 । అక్టోబర్ । 2023



రాష్ట్ర స్థాయి క్రీడలకు ఎంపిక

జిల్లాలోని పలువురు గ్రామీణ విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్టు అధికారులు తెలిపారు. - 8లో



అందరికీ ఆరోగ్య సురక్ష

జిల్లాలో ప్రతి ఒక్కరికీ జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ద్వారా ఉచిత వైద్యపరీక్షలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. - 8లో

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	35	25
చిత్తూరు	34	24
తిరుమల	30	21
గూడూరు	37	26
నగరి	36	25

న్యూస్‌రీల్

స్పందనకు 251 అర్జీలు



అర్జీలను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి అర్బన్: కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి 251 అర్జీలు వచ్చినట్టు కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి తెలిపారు. ఇందులో 172 అర్జీలు రెవెన్యూకు సంబంధించినవే ఉన్నాయన్నారు. సంబంధిత అర్జీలను వెంటనే పరిష్కరించే విధంగా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు.

శ్రీవారి దర్శనానికి 6 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 70,515 మంది స్వామివారిని దర్శించుకోగా.. 27,230 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.23 కోట్లు సమర్పించారు. టైం స్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 6 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

బ్రహ్మోత్సవాలకు సర్వీసులు సిద్ధం చేయండి



మాట్లాడుతున్న డీపీటీఓ చెంగల్‌రెడ్డి

తిరుపతి అర్బన్: శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయడానికి అంతా సిద్ధంగా ఉండాలని జిల్లా ప్రజారవాణా అధికారి(డీపీటీఓ) చెంగల్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం ఆయన తిరుపతిలోని తన చాంబర్‌లో జిల్లాలోని 11 ఆర్టీసీ డిపో సూపర్‌వైజర్లు, మెకానిక్‌లతో సమావేశమయ్యారు. బస్సులను సరైన కండిషన్‌లో ఉంచాలని చెప్పారు. సెప్టెంబర్‌లో నిర్వహించిన శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో రూ.7 కోట్ల మేర రాబడి వచ్చిందన్నారు. ఈనెలలో జరగనున్న నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో రూ.10 కోట్లు వచ్చేలా పనిచేయాలని చెప్పారు. మరోవైపు ప్రయాణికులకు చిన్నపాటి ఇబ్బందులు లేకుండా సర్వీసులు అందుబాటులో ఉంచాలని చెప్పారు. ఇబ్బందులు ఉంటే ఎప్పటికప్పుడు తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. మెకానిక్ ఇంజినీర్ నరసింహులు పాల్గొన్నారు.


రేపు దివ్యాంగులకు ప్రత్యేక జాబ్‌మేళా

తిరుపతి సిటీ : ఎస్వీ యూనివర్సిటీ ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయంలో బుధవారం ఉదయం 10 గంటలకు దివ్యాంగుల కోసం ప్రత్యేక జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు కార్యాలయ అధికారి శ్రీనివాసులు తెలిపారు. డీ మార్ట్, అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి ఎంఎన్‌సీ కంపెనీల ప్రతినిధులు 246 ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఎస్‌ఎస్‌సీ పాస్ అయిన చెవిటి, మూగ, అంగవైకల్యం కల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 9533889902, 798910194లో సంప్రదించాలని సూచించారు.

నేటి వరకు పీజీ తొలి విడత అడ్మిషన్లు

తిరుపతి సిటీ : ఎస్వీయూ పీజీ సెట్–2023లో తొలివిడత అడ్మిషన్లు మంగళవారంతో ముగియనున్నట్లు డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ ప్రొఫెసర్ శ్రీమురళి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ సుమారు 600మందికి పైగా విద్యార్థులు పలు పీజీ కోర్సులలో అడ్మిషన్లు పొందారని వెల్లడించారు. తొలివిడత సీట్ల కేటాయింపులో ఇప్పటికే 75శాతం మంది విద్యార్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ పూర్తయిందని, మరో 25శాతం మందికి మంగళవారం వరకు అవకాశముందని వివరించారు.

నగలు లాకర్‌లో భద్రం



నగలను భద్రపరుస్తున్న ఆలయ అధికారులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరస్వామి వారి నగలను సోమవారం పట్టణంలోని స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా దేవస్థానం బ్రాంచ్‌లో భద్రపరిచారు. ఇటీవల ఆలయంలో పవిత్రోత్సవాల నేపథ్యంలో లాకర్‌లో ఉన్న నగలను తీసుకువచ్చి స్వామివారికి అలంకరించారు. పవిత్రోత్సవాలు ముగియడంతో మళ్లీ నగలను లాకర్‌లో భద్రపరిచారు. ఆలయ ఈఓ సాగర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

అందరూ నచ్చేలా.. భక్తులు మెచ్చేలా..!



తిరుపతి నగర వివరాలు

విస్తీర్ణం	30.01 చ.కి
గృహాలు	92 వేలు
జనాభా	4.01 లక్షలు
డివిజన్లు	50

మనసు నిండా భక్తిభావాన్ని నింపుకుని.. గోవిందుడిని స్మరిస్తూ వస్తున్న భక్తులకు మరింత ఆహ్లాదాన్ని.. ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించాలని టీటీడీ సంకల్పించింది. మొదట తిరుమల శ్రీవారి పాదాల చెంత ఉన్న తిరుపతిని స్వచ్ఛ తిరుపతి.. సుందర తిరుపతిగా మార్చాలని నిర్ణయించింది. ఇందులో భాగంగానే అత్యంత క్లిష్టంగా మారిన పారిశుద్ధ్య నిర్వహణలో టీటీడీని భాగస్వామ్యం చేస్తూ పాలక మండలి ఆమోద ముద్ర వేసింది. శ్రీవారి 'కరుణ'తో తిరుపతి పరపతి మరింత పెరిగేలా చర్యలు చేపట్టడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

- తిరుపతి పారిశుద్ధ్య నిర్వహణలో టీటీడీ భాగస్వామ్యం
- టీటీడీ బోర్డు సమావేశంలో కీలక నిర్ణయం
- అవసరమైన సిబ్బందిని సమకూర్చేందుకు ఆమోదం
- స్వచ్ఛ తిరుపతి–సుందర తిరుపతే లక్ష్యం
- టీటీడీ ధర్మకర్తల మండలి ఛైర్మన్ భూమన కృషిపై సర్వత్రా హర్షం
- ఇందులో డెప్యూటీ మేయర్ అభినయ్ కీలకం

మున్సిపల్ కార్పొరేషన్ పారిశుద్ధ్య సమాచారం

ప్రజారోగ్య శాఖలో పనిచేస్తున్న సిబ్బంది	1,399
శాశ్వత పారిశుద్ధ్య కార్మికులు	134
అవుట్ సోర్సింగ్ కార్మికులు	706
డ్రైవర్లు	88
ఆటోలు	75
ఇతర వాహనాలు	జేసీబీలు, ట్రాక్టర్లు, టిప్పర్లు

తిరుపతి తుడా: మాస్టర్ ప్లాన్ రోడ్ల నిర్మాణంతో కొత్త పుంతలు తొక్కుతున్న తిరుపతి నగరాభివృద్ధికి సోమవారం మరో కీలక అడుగు పడింది. ప్రపంచ ప్రసిద్ధిగాంచిన ఆధ్యాత్మిక నగరాన్ని మరింత పరిశుభ్ర నగరంగా తీర్చిదిద్దడానికి టీటీడీ పాలకమండలి ఆమోద ముద్ర వేసింది. డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి చొరవతో క్లీన్ తిరుపతి కోసం ఇటీవల మేధావులు, వివిధ రాజకీయ పార్టీల నేతృత్వంలో టీటీడీ భాగస్వామ్యం కావాలని సంకల్పించిన కృషి ఎట్టకేలకు ఫలించింది. దీనికి ఆమోద ముద్ర వేస్తూ టీటీడీ చైర్మన్, స్థానిక ఎమ్మెల్యే భూమన కరుణాకరెడ్డి ఆధ్వర్యంలో బోర్డు ఏకగ్రీవ తీర్మానం చేయడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

టీటీడీ భాగస్వామ్యం ఎందుకంటే?

తిరుపతి నగరంలో టీటీడీకి చెందిన అనేక ఆలయాలు, అతిథి గృహాలు, సత్రాలు ఉన్నాయి. దేశ, విదేశాల నుంచి తిరుమల శ్రీవారి దర్శనం కోసం వచ్చే భక్తులు ఈ ప్రాంతాలలో కలియతిరుగుతుంటారు. యాత్రికులకు స్వచ్ఛ తిరుపతిపై అవగాహన లేక రోడ్ల మీద చెత్తాచెదారం విచ్చలవిడిగా పడేస్తుంటారు. నిత్యం పరిశుభ్రత కోసం చేస్తున్న ప్రయత్నాలకు ఆటకం కలిగిస్తున్నారు. నగర పాలక సంస్థలోని ప్రజారోగ్య విభాగంలో పనిచేస్తున్న సుమారు 840 మంది పారిశుద్ధ్య కార్మికులు, మరో 399 మంది అన్ని స్థాయిలలో విధులు నిర్వహిస్తున్నా అనుకున్న లక్ష్యాన్ని చేరుకోలేక పోతున్నారు. ఈ క్రమంలో యాత్రికులు సంచరించే ప్రాంతాలు, టీటీడీ అనుబంధ ఆలయాలు, సత్రాలు, ప్రధాన రహదారుల్లో పారిశుద్ధ్య నిర్వహణలో టీటీడీని భాగస్వామ్యం చేయాలని మేధావులు, స్థానిక ప్రముఖులు సంకల్పించారు. అలాచేస్తేనే తిరుపతి పరపతి మరింత పెరుగుతుందని భావించారు. ఈ క్రమంలోనే ప్రతిపాదనలను టీటీడీకి పంపారు.



తిరుపతిలో పారిశుద్ధ్య పనుల్లో సిబ్బంది

వార్షిక బడ్జెట్‌లోనూ 1 శాతం నిధులు

తిరుపతి అభివృద్ధికి ఏటా టీటీడీ వార్షిక బడ్జెట్‌లో 1 శాతం నిధులు కేటాయించేలా టీటీడీ బోర్డు ఆమోదముద్ర వేసింది. ఒక శాతం నిధులంటే ఏటా రూ.45 కోట్లు తిరుపతి అభివృద్ధికి వెచ్చించే అవకాశం ఉంది. ఇది టీటీడీ వార్షిక బడ్జెట్‌తోపాటు ప్రతి ఏటా పెరగనుంది. దీంతో తిరుపతి ముఖచిత్రమే మారనుంది.

టీటీడీ పెద్దన్న పాత్ర పోషిస్తుంది



తిరుపతి నగర అభివృద్ధి, పారిశుద్ధ్యంలో ఇకపై టీటీడీ పెద్దన్న పాత్ర పోషిస్తుంది. రోజూ తిరుపతికి వచ్చే వేలాది మంది యాత్రికులు మెచ్చేలా, ఆధ్యాత్మిక చింతన ఉట్టిపడేలా అభివృద్ధి ప్రణాళికలు రచించాం. టీటీడీ సహకారంతోనే పలు ప్రాంతాల్లో రోడ్ల విస్తరణ, కొత్త రోడ్లు, ఫ్రీ లెఫ్ట్‌ల అభివృద్ధి సాధ్యమైంది. క్లీన్ తిరుపతి కోసం టీటీడీ నుంచి అవసరమైన కార్మికులను అందిస్తూ తీసుకున్న నిర్ణయం నగర ప్రజలకు అంకితం. టీటీడీ నుంచి ఒక శాతం నిధులను నగర పారిశుద్ధ్యం కోసం ఖర్చు చేయబోతున్నాం. తిరుపతి అభివృద్ధిలో భాగంగా తీసుకున్న చారిత్రక నిర్ణయాల్లో దీనిదే అగ్రస్థానం. – భూమన కరుణాకరరెడ్డి, టీటీడీ ఛైర్మన్, స్థానిక ఎమ్మెల్యే

చట్టంగా మార్చాలి



తిరుపతి నగర అభివృద్ధి బాధ్యత టీటీడీ తీసుకోవడం శుభ పరిణామం. తిరుమల కూడా తిరుపతిలో భాగమే. తిరుపతిని వేరు చేసి చూడడం సరైనది కాదు. అభివృద్ధి, పారిశుద్ధ్య నిర్వహణ కోసం టీటీడీ తీసుకున్న నిర్ణయం చట్ట రూపంలో తీసుకురావాలి. ప్రభుత్వం కూడా దీనిపై సరైన నిర్ణయం తీసుకోవాలి. టీటీడీ నిధులను ప్రపంచవ్యాప్తంగా ఖర్చు చేయడం కాదు.. ప్రతి యాత్రికుడు మొదట కాలు పెట్టే తిరుపతిలో సౌకర్యాల కల్పనపై ప్రధానంగా దృష్టి సారించాలి. టీటీడీ తీసుకున్న నిర్ణయం అభినందనీయం. – కందారపు మురళి, సీఐటీయూ, రాష్ట్ర ఉపాధ్యక్షులు

టీటీడీకి ధన్యవాదాలు



తిరుపతి నగరం అన్ని విధాలా అభివృద్ధి చెందుతోంది. ఈ నేపథ్యంలో మున్సిపల్ కార్పొరేషన్ ప్రజారోగ్య శాఖలో పని చేస్తున్న సిబ్బందితో పారిశుద్ధ్య నిర్వహణ కష్టంగా మారింది. నగరంపై ఒత్తిడి పెరగడానికి, అపరిశుభ్రతకు యాత్రికులు కూడా కారణమే. తిరుపతి పారిశుద్ధ్య నిర్వహణలో టీటీడీ భాగస్వామ్యం ఎంతైనా అవసరముంది. ఈ విషయాన్ని గుర్తించి మేము చేసి విజ్ఞప్తులను టీటీడీ ఛైర్మన్ భూమన కరుణాకరరెడ్డి నేతృత్వంలోని పాలకమండలి ఆమోద ముద్ర వేసింది. అవసరమైన సిబ్బందిని కేటాయిస్తే తిరుమల తరహాలో క్లీన్ తిరుపతి సాధ్యం. ఈ నిర్ణయం నగర ప్రజల విజయం. సహకరించిన టీటీడీకి ధన్యావాదాలు. – భూమన అభినయ్‌రెడ్డి, డెప్యూటీ మేయర్, నగరపాలక సంస్థ, తిరుపతి

'అంకుర'తో వ్యవసాయరంగం అభివృద్ధి

- అగ్రి బిజినెస్ ఇంక్యుబేటర్ ఆధ్వర్యంలో యువ ఔత్సాహికులకు శిక్షణ
- ముఖ్య అతిథిగా హాజరైన మహిళా వర్సిటీ వీసీ భారతి



ప్రసంగిస్తున్న వీసీ డాక్టర్ భారతి



జ్యోతి ప్రజ్వలన చేసి శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వీసీ డాక్టర్ భారతి, ఆర్‌ఏఆర్‌ఎస్ ఏడీఆర్ రమణ

తిరుపతి సిటీ : గ్రామీణ, చిన్న పట్టణాల్లో అంకుర సంస్థల ఏర్పాటు చేయడం ద్వారా ఆయా ప్రాంతాల్లో వ్యవసాయరంగం అభివృద్ధి చెందుతుందని శ్రీపద్మావతి మహిళా వర్సిటీ వీసీ డి.భారతి తెలిపారు. సోమవారం ఆంగ్రూ వర్సిటీ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం పరిధిలో అమలవుతున్న అగ్రి బిజినెస్ ఇంక్యుబేటర్‌కు ఎంపికైన ఆరో బ్యాచ్ ఔత్సాహిక యువ ఇన్నోవేటర్లకు శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన వీసీ భారతి మాట్లాడుతూ యువత ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా పారిశ్రామికవేత్తలుగా తయారై పదిమందికి ఉపాధి కల్పించాలని సూచించారు. ఔత్సాహిక ఇన్నోవేటర్ల వినూత్నమైన ఆలోచనలకు అగ్రి బిజినెస్ ఇంక్యుబేటర్ ఆధ్వర్యంలో నెట్‌వర్కింగ్, ఆర్థిక సహకారం అందిస్తూ వ్యవసాయ రంగ ఆధారిత అంకుర సంస్థల ఏర్పాటుకు తోడ్పాటు అందించడం అభినందనీయమన్నారు. యువత ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా మారి స్వయంగా అంకుర సంస్థలను ఏర్పాటు చేసి ఇతరులకు జీవనోపాధి కల్పించడం సంతోషంగా ఉందని తెలిపారు. ఆర్‌ఏఆర్‌ఎస్ ఏడీఆర్ డాక్టర్ సి.రమణ, వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జి.ప్రభాకరరెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ విశ్వవిద్యాలయం ద్వారా చేపడుతున్న పలు కార్యక్రమాలను వివరించారు. అంకుర సంస్థల ద్వారా వ్యవసాయరంగంలో పురోగతి సాధించవచ్చన్నారు. ఇప్పటివరకు ఐదు బ్యాచ్‌లుగా 192 మందికి శిక్షణ ఇవ్వడమే కాకుండా 56 అంకుర సంస్థలకు దాదాపు రూ. 405 లక్షలను గ్రాంటుగా అందించిన అగ్రి బిజినెస్ ఇంక్యుబేటర్ సెంటర్‌కు అభినందనలు తెలిపారు. అనంతరం ఇంక్యుబేటర్ ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్ డాక్టర్ బాల హుస్సేన్‌రెడ్డి 2019 నుంచి అంగ్రూ అగ్రి బిజినెస్ ఇంక్యుబేటర్ ప్రగతిని వివరించారు. కార్యక్రమంలో అగ్రి బిజినెస్ ఇన్‌స్టిట్యూట్ హెడ్ డాక్టర్ పీవీ సత్యగోపాల్, సిబ్బంది లక్ష్మీతులసి, అశ్విక్, సంతోష్, రమాదేవి పాల్గొన్నారు.

గ్రాంట్‌గా నగదు



ప్రస్తుతం ఇంక్యుబేటర్ సెంటర్‌లో శిక్షణకు హాజరైన ఔత్సాహికుల ప్రతిభను ఆధారంగా తీసుకుని మరో లెవల్‌కు పంపుతాం. అనంతరం హైదరాబాద్‌లో కేంద్ర కమిటీ ఆధ్వర్యంలో ఔత్సాహికుల ఫైనల్ సెలక్షన్ ఉంటుంది. అందులో ప్రతిభ చూపిన వారికి సంకల్ప ప్రోగ్రామ్ కింద రూ. 5లక్షలు, సంవృద్ధి ప్రోగ్రామ్ కింద రూ. 25లక్షలు గ్రాంట్‌గా అందిస్తాం. వ్యవసాయ రంగంలో అధునాతన సాంకేతికతను ప్రోత్సహించడమే ఇంక్యుబేటర్ ప్రధాన లక్ష్యం
– డాక్టర్ బాల హుస్సేన్‌రెడ్డి, ఇంక్యుబేటర్ ప్రిన్సిపల్

కిసాన్ రిమోట్ డివైజ్ కనిపెట్టా



వ్యవసాయరంగంలో నీటిపారుదల కోసం ఉపయోగించే ఎలక్ట్రికల్ పంపు మోటార్ ఆపరేట్ చేసేందుకు కిసాన్ రిమోట్ డివైజ్ కనిపెట్టా. దీన్ని ఉపయోగించి రైతులు తమ ఇంటి నుంచే పంపు సెట్‌ను ఆన్ అండ్ ఆఫ్ చేసుకోవచ్చు. దీంతో రైతులు విద్యుత్ షాక్‌కు గురికాకుండా ఉండడంతోపాటు రాత్రి సమయంలో పాము, విష పురుగుల ప్రమాదాల నుంచి రక్షణ పొందవచ్చు.
– వీ.శ్రీనివాస్, ఖమ్మం, తెలంగాణ

రైతుల కోసం ఎలక్ట్రిక్ వీల్ ట్రాలీ



రైతుల తాము పండించిన పంటను హార్వెస్ట్ చేసిన తర్వాత పొలం నుంచి బయటకు తీసుకొచ్చేందుకు శ్రమలేకుండా ఒకసారిగా ఎక్కువ మొత్తంలో ఉత్పత్తిని గట్టుకు చేర్చే సాధనమే ఎలక్ట్రిక్ వీల్ ట్రాలీ. ఆర్‌ఏఆర్‌ఎస్ నిర్వహించిన సెలక్షన్‌లో నేను కనుగొన్న ట్రాలీ సంకల్ప ప్రోగ్రామ్‌కు ఎంపిక చేశారు. ఇంక్యుబేటర్ సెంటర్ ద్వారా శిక్షణ పొంది ఈ పరికరంపై మరింత పట్టు సాధిస్తా.
– ఎం.భానుప్రియ, రాయచోటి, అన్నమయ్య జిల్లా

ఏటీపీ అనుసంధానం పరిశీలన



బ్యాలెట్, కంట్రోల్ యూనిట్ల యాక్సెప్టెన్సీ టెస్ట్ ప్రక్రియను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

రేణిగుంట: రేణిగుంట సీడబ్ల్యూసీ గోడౌన్‌లో ఉన్న బ్యాలెట్, కంట్రోల్ యూనిట్ల ఏటీపీ అనుసంధాన ప్రక్రియను సోమవారం కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి పరిశీలించారు. సోమవారం మధ్యాహ్నం గోడౌన్‌కు చేరుకున్న ఆయన ఈవీఎం గోడౌన్‌లో ఉన్న బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్ల యాక్సెప్టెన్సీ టెస్ట్ ప్రక్రియను పరిశీలించారు. భవిష్యత్‌లో ఎలాంటి సాంకేతిక సమస్యలు తలెత్తకుండా యాక్సెప్టెన్సీ టెస్ట్ ప్రక్రియను పూర్తి చేయాలని బెల్ సాంకేతిక సిబ్బందికి ఆయన సూచించారు. గత నెల 28వ తేదీ నుంచి రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో అనుసంధాన ప్రక్రియ ప్రారంభించారు. అధికారులు, సాంకేతిక సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు సాంకేతిక లోపాలున్న వాటిని వేరు చేసి వాటిని ఎన్నికల కమిషన్‌కు అందజేస్తే వాటి స్థానంలో మార్పు చేసి ఇస్తారన్నారు. ఏటీపీ పూర్తైన వెంటనే ఫస్ట్ లెవల్ చెకింగ్ ప్రక్రియను ప్రారంభించాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ లీగల్ సెల్ అండ్ ఈవీఎం నోడల్ అధికారి శ్రీనివాసులు, జీఎన్‌ఎస్‌ఎస్ డిప్యూటీ కలెక్టర్ కోదండరామిరెడ్డి, తహసీల్దార్లు పాల్గొన్నారు.

అయోధ్యకాండ పారాయణం



పారాయణం చేస్తున్న పండితులు

తిరుమల : శ్రీవారి అనుగ్రహంతో సృష్టిలోని జీవరాశులన్నీ సుభిక్షంగా ఉండాలని, సకల కార్యాలు సిద్ధించాలని ప్రార్థిస్తూ తిరుమల నాదనీరాజనం వేదికపై సోమవారం ఉదయం 7 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన 4వ విడత అయోధ్యకాండ అఖండ పారాయణం భక్తరంజకంగా జరిగింది. హనుమత్ సమేత సీతారామలక్ష్మణుల ఉత్సవమూర్తుల సమక్షంలో కార్యక్రమం ఆద్యంతం రామనామస్మరణతో సాగింది. ఈ సందర్భంగా 12, 13వ సర్గలలోని 142 శ్లోకాలను పారాయణం చేశారు. యోగవాసిష్ఠం–ధన్వంతరి మహామంత్రం 25 శ్లోకాలను పఠించారు. ధర్మగిరి వేద పాఠశాల పండితులు ఆచార్య రామానుజాచార్యులు, అనంత గోపాల కృష్ణ, పీవీఎస్ఎన్ మారుతి శ్లోక పారాయణం చేశారు. కార్యక్రమంలో తొలుత టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్ట్ కళాకారులు లావణ్య బృందం 'ఓ రామ నీ నామమేమి రుచిరా..' చివర్లో 'రామ రామ రత్న జతిత సింహాసన...' భజన కీర్తనలను శ్రవణానందకరంగా ఆలపించారు.

మహిళా వర్సిటీలో జాతీయ వర్క్‌షాప్ ప్రారంభం



వర్క్‌షాపులో పాల్గొన్న విద్యార్థులు

తిరుపతి సిటీ : పద్మావతి మహిళా యూనివర్సిటీలోని ఐపీటీ డిజిటల్ క్లాస్ రూమ్‌లో సోమవారం డీబీటీ బిల్డర్ ప్రాజెక్ట్ టీమ్–1, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ టెక్నాలజీ సంయుక్తంగా ఐదు రోజుల హ్యాండ్లింగ్ ఆఫ్ ఎక్స్‌పెరిమెంటల్ అనిమల్స్ అన్న అంశంపై జాతీయ వర్క్‌షాపు ప్రారంభమైంది. ఇందులో వీసీ భారతి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఔషధాల ప్రయోగాల్లో జంతువుల మీద పరిశోధనలు చేసేటప్పుడు అతి జాగ్రతలు పాటిస్తూ వాటికి ప్రాణహాని కలుగకుండా చూడాల్సిన అవసరముందన్నారు. పరిశోధన సమయంలో జంతువులను ఎలా సద్వినియోగం చేసుకోవాలనే అంశాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ సైన్సెస్ డీన్ సుజాతమ్మ, ఫార్మాస్యూటికల్ టెక్నాలజీ హెడ్ శైలజ, కోఆర్డినేటర్ శ్రీదేవి, ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్లు రజిత, ఇందిరా ముజీబ్, సుజాత పాల్గొన్నారు.

నర్సింగ్ కోర్సుల ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి కల్చరల్: ప్రభుత్వ గ్రాంట్ సహాయంతో తిరుపతిలో నడుపుతున్న రాస్ ఎస్ఎంయూ శిక్షణ కేంద్రంలో ఉచిత నర్సింగ్ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రాస్ ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటరత్నం తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరంలో రెండేళ్ల కాలపరిమితి గల ఎంపీహెచ్‌డబ్ల్యూ నర్సింగ్ కోర్సు శిక్షణకు ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణులైన మహిళా అభ్యర్థినులు అర్హులని పేర్కొన్నారు. చిత్తూరు, అనంతపురం జిల్లా వాసులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఆసక్తిగల వారు ఈనెల 31వ తేదీలోపు ఎస్.వెంకటరత్నం, ప్రధాన కార్యదర్శి, రాస్, తిరుపతి చిరునామాకు దరఖాస్తులు పంపాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 8179769449, 9494685529ను సంప్రదించాలని ఆయన కోరారు.

నేడు రెజ్లింగ్ జిల్లా జట్ల ఎంపిక పోటీలు

నాయుడుపేట: నాయుడుపేట అంబేడ్కర్ బాలుర గురుకుల పాఠశాల ఆవరణలో మంగళవారం రెజ్లింగ్ జిల్లా జట్ల ఎంపికి పోటీలు నిర్వహించనున్నట్టు కోచ్, రెజ్లిలింగ్ అసోసియేషన్ సెక్రటరీ ఉదయ్‌కుమార్ సోమవారం తెలిపారు. గురుకులంలో మధ్యాహ్నం 12 గంటలకు ఎంపిక పోటీలు ఉంటాయని, విద్యార్థినీవిద్యార్థులు 19 ఏళ్లు పైబడిన వారు అర్హులని చెప్పారు. రెజ్లిలింగ్ ఫ్రీ స్టైయిల్ విభాగంలో 86 కేజీలు, 125 కేజీలు ఉంటాయన్నారు. గ్రీకు రోమన్ విభాగంలో 60 కేజీలు, 77 కేజీలు, 87 కేజీలు ఉండాలన్నారు. మహిళల విభాగంలో 50 కేజీలు, 53 కేజీలు, 62 కేజీలు, 68 కేజీలు, 76 కేజీలు విభాగాల్లో సెక్షన్స్ ఉంటాయని తెలిపారు.

ఆర్థిక లావాదేవీలే హత్యకు కారణం

- ఏడాది క్రితమే చంపేస్తానని భార్యను, బామ్మర్దిని హెచ్చరించాడు
- ఆపై మారిపోయానని నమ్మించి విమానంలో తిరుపతికి రప్పించాడు
- పథకం ప్రకారమే హోటల్ గదిలో కత్తితో నరికి చంపేశాడు
- పోలీసుల విచారణలో వెలుగుచూసిన ఆసక్తికర విషయాలు
- అరెస్టు అనంతరం హంతకుడికి రిమాండ్


నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ సురేందర్‌రెడ్డి

తిరుపతి క్రైం: 'ఆర్థిక లావాదేవీలతో ఏడాదిగా భార్యకు దూరంగా ఉంటూనే అక్రమ సంబంధం ఉందని భార్యను అనుమానించాడు. పథకం ప్రకారం భార్యను, ఆమెకు సహకరిస్తున్న బావమరిదిని తిరుపతికి పిలిపించుకుని హోటల్ గదిలో రెండు రోజుల క్రితం అతి కిరాతకంగా హత్య చేశాడు' అని తిరుపతి ఈస్ట్ డీఎస్పీ ఎ.సురేంద్ర రెడ్డి తెలిపారు. ఆయన కథనం.. మహారాష్ట్ర, నాందేడ్ జిల్లా, తరోడ ఖుర్ద్, పూర్ణ రోడ్డు నవజీవన్ నగర్‌లో నివాసముంటున్న యువరాజ్ సాంబాజీ నర్వాడే వృత్తిరీత్యా భవన నిర్మాణ రంగంలో మేస్త్రి. ఇతనికి మనీషా యువరాజ్ నర్వాడే అనే మహిళతో 12 ఏళ్ల క్రితమే వివాహమైంది. వీరికి ఇద్దరు కొడుకులు ఉండగా.. చిన్న కొడుకు దివ్యాంగుడు. ఇదిలా ఉండగా మేస్త్రీ పనులు చేస్తూనే యువరాజ్ చెడు అలవాట్లకు బానిసయ్యాడు. సంపాదించిన డబ్బుని ఇష్టారాజ్యంగా ఖర్చుచేస్తూ జల్సా జీవితానికి అలవాటు పడ్డాడు. కుటుంబ పోషణ పూర్తిగా వదిలేశాడు. చేసిన అప్పులు తీర్చేందుకి తన ఇంటి స్థలాన్ని రూ.40 లక్షలకు అమ్మి, వచ్చిన డబ్బుతో తన విలాసాలకు ఖర్చు పెడుతుండేవాడు. ఈ విషయాన్ని భార్య మనీషా(23) తన అన్న హర్షవర్ధన్ కైలాష్ దుర్మల్ (25)తో కలిసి భర్తను నిలదీసింది.

వాటా అడిగినందుకే..

స్థలాన్ని రూ.40 లక్షలకు అమ్మి చెడువ్యసనాలకు పెడుతున్నాడని భర్త యువరాజును భార్య మనీషా ఆమె అన్న నిలదీయడమే కాకుండా గట్టిగా మందలించడంతో ఇంటి నుంచి వెళ్లిపోయాడు. అదే సమయంలో «నా జోలికి వస్తే మీ అంతు చూస్తా, సంవత్సరంలోగా మీ ఇద్దరినీ చంపేస్తా» ను అంటూ హెచ్చరించి వెళ్లిపోయాడు. అలా వెళ్లిన యువరాజ్ హైదరాబాద్, గోవా వంటి ప్రాంతాలలో జల్సాలు చేసుకుంటూ తిరుగుతుండేవాడు. తరచూ తన భార్య, బావమరిదిలో ఫోన్ చేసి ఇంటి సమస్యలు చెబుతూ, ఇంటికి వచ్చేయాలని పిలుస్తుండడంతో తన సంతోషానికి అడ్డు తగులుతున్నారని యువరాజ్ విసుగు చెందేవాడు. పైగా ఏడాదిగా ఒంటరిగా ఉన్న తన భార్య తన అన్నతో అక్రమ సంబంధం పెట్టుకుందేమోనని అనుమానించాడు.

విమానంలో రప్పించుకుని హత్య చేశాడు

యువరాజ్ ఈనెల 1వ తేదీన తిరుపతికి చేరుకున్నాడు. తన భార్యను, బామ్మర్దిని ఎలా హత్య చేయాలో పథకం రచించాడు. తాను అన్నీచెడు అలవాట్లు మానేశానని, మీరు తిరుపతికి వస్తే తిరుమల శ్రీవారిని దర్శించుకుని ఇక్కడి నుంచే ఇంటికి వెళ్దామని నమ్మబలికాడు. అందులో భాగంగానే నాందేడ్ నుంచి హైదరాబాద్‌కు ట్రైన్‌లో వచ్చి, అక్కడి నుంచి తిరుపతికి ఫ్లైట్‌లో వచ్చేలా తానే టికెట్లు బుక్ చేసి, ఈనెల 5వ తేదీన తిరుపతికి రప్పించాడు. కపిలతీర్థం సమీపంలోనే ఓ లాడ్జీలో గదిని తీసుకున్నారు. అర్ధరాత్రి రెండు గంటలకు భార్యతో గొడవకు దిగాడు. ఆపై వెంట తెచ్చుకున్న కత్తితో భార్య తలపై నరికాడు. ఇంతలో నిద్ర నుంచి ఉలిక్కిపడి లేచిన బామర్ది హర్షవర్ధన్‌ను కత్తితో నరికి హత్య చేశాడు. భార్య అతికష్టం మీద లేచి తన అన్నపై జరుగుతున్న దాడిని అడ్డుకోబోయింది. దీంతో మరింత రెచ్చిపోయిన యువరాజ్ తన భార్యను అతి కిరాతకంగా హత్య చేశాడు. ఈ మేరకు హంతకుడు యువరాజును అరెస్టు చేసి హత్యకు ఉపయోగించిన కత్తిని స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. కేసులో ప్రతిభచాటిన ఎస్ఐలు ఇమ్రాన్ బాషా, రాజశేఖర్‌కు రివార్డులను ప్రకటించారు.

అందరికీ జగనన్న ఆరోగ్య సురక్ష

తిరుపతి అర్బన్: జగనన్న ఆరోగ్య సురక్ష కింద ప్రతి ఇంటా సర్వే చేసి వైద్య సేవలను అందించాలని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి ఆదేశించారు. ఆయన సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమంపై అధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ చిల్లకూరు, సూళ్లూరుపేట, ఓజిలి, నాయుడు పేట మండలాలతోపాటు తిరుపతి అర్బన్ ప్రాంతాల్లో అధికారులతో సమన్వయం చేసుకుని కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని కోరారు. వైద్య శిబిరాల్లో ఓపీలు తగ్గకుండా చూడాలన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో 350 మంది, పట్టణ ప్రాంతాల్లో 600 మందికి తగ్గకుండా శ్రద్ధ పెట్టాలని ఆదేశించారు. ప్రత్యేక వ్యాధిగ్రస్తులకు మెరుగైన చికిత్స అందించేందుకు రెఫరల్ హాస్పిటల్స్‌కు ఆరోగ్యశ్రీ కింద అనుసంధానం చేయాలని తెలిపారు. కంటి వెలుగు కింద వైద్య శిబిరాల్లో కంటి పరీక్షలు నిర్వహించాలని, పరీక్షల వివరాలను అదే రోజు యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. తిరుపతి నగర పాలక సంస్థ కమిషనర్ హరిత, తిరుపతి ఆర్డీవో కనక నరసారెడ్డి, డీఎంహెచ్‌వో శ్రీహరి, సీపీవో ప్రేమచంద్రారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ విజయ్ కుమార్, జిల్లా పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ అధికారి శంకర్ నారాయణ, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ కృష్ణారెడ్డి, జిల్లా గ్రామ వార్డు సచివాలయ ఇన్‌చార్జి అధికారిణి సుశీలాదేవి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి క్రీడలకు ఎంపిక

వాకాడు: మండల కేంద్రమైన వాకాడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి క్రీడలకు ఎంపికై నట్లు ప్రిన్సిపల్ రామానుజ ఆచార్యులు తెలిపారు. సోమవారం ఆయన రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడల్లో తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు వివిధ ఆటల్లో మండల స్థాయి నుంచి జిల్లా స్థాయికి.. ఆపై రాష్ట్ర స్థాయి క్రీడలకు ఎంపికైనట్టు తెలిపారు. ఈ సందర్భంగా పీడీ రాజ్‌కుమార్, పీఈటీ శ్రీనును అభినందించారు. వైస్ ప్రిన్సిపల్ విజయకుమార్ పాల్గొన్నారు.


వాకాడు: క్రీడాకారులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ రామానుజ ఆచార్యులు

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ పోటీలకు చిట్టమూరు విద్యార్థులు

చిట్టమూరు: స్థానిక జెడ్పీ హైస్కూలుకు చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు మీనాకుమారి తెలిపారు. జిల్లా స్థాయిలో జరిగిన పోటీలలో అండర్–14 విభాగంలో అథ్లెటిక్ పోటీలలో ఈదూరు కౌశల్య, దారా వాసు ప్రతిభకనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్టు వెల్లడించారు. ఈ నెల 12న పల్నాడులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జరిగే పోటీలలో పాల్గొంటారని చెప్పారు. అలాగే రాష్ట్ర స్థాయిలో జరిగే వాలీబాల్ పోటీలకు పాఠశాల నుంచి భారతి, మమత, ఫర్హాన, మనోజ్ఞ, అభి ఎంపికైనట్టు తెలిపారు. ఈ సందర్భంగా పీడీ భరత్ మహీపతిని అభినందించారు.


ప్రతినిధుల సభలో జిల్లా నేతలు
విజయవాడలో సోమవారం నిర్వహించిన వైఎస్సార్‌సీపీ ప్రతినిధుల విస్తృత స్థాయి సమావేశంలో జగనన్న ఆశీర్వాదం తీసుకుంటున్న మంత్రి ఆర్‌కే రోజా, సమావేశంలో ఏపీఎస్ఆర్‌టీసీ వైస్‌చైర్మన్ ఎంసీ విజయానందరెడ్డి, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

ముక్కంటి సేవలో శ్యామలరావు

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని సోమవారం రాష్ట్ర హయ్యర్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్యామలరావు కుటుంబ సమేతంగా విచ్చేసి దర్శించుకున్నారు. ఆలయ దక్షిణ గోపురం వద్ద అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో పండితులు వేద ఆశీర్వచనం అందించగా అధికారులు లడ్డూ ప్రసాదాలు, జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు.


గురుదక్షిణామూర్తి సన్నిధిలో రాష్ట్ర హయ్యర్ ఎడ్యుకేషన్ పిన్సిపల్ సెక్రటరీ శ్యామలరావు

రైలు నుంచి పడి బీటెక్ విద్యార్థి మృతి

దొరవారిసత్రం: కలగుంట గ్రామ సమీపంలోని ఆఫ్ లైన్ పట్టాలపై రైలు నుంచి ప్రమాదవశాత్తు పడి బీటెక్ విద్యార్థి పక్కి వెంటసాయిఅభిరామ్(20) ఆదివారం రాత్రి మృతి చెందిన ఘటన సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సూళ్లూరుపేట జీఆర్పీ పోలీసుల కథనం.. శ్రీకాకుళం జిల్లా, రాజం ప్రాంతానికి చెందిన వెంకటసాయి అభిరామ్ చైన్నైలోని ఐఐటీ కాలేజ్‌లో బీటెక్ తృతీయ సంవత్సరం అభ్యసిస్తున్నాడు. గత వారం ప్రవేశ పరీక్షలు రాసే నిమిత్తం ఢిల్లీకి వెళ్లి తిరిగి చెన్నైకి వెళ్తుండగా ఆదివారం రాత్రి కలగుంట గ్రామ సమీపం వచ్చేసరికి ప్రమాదావశాత్తు రైలు నుంచి జారిపడిపోయాడు. తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న జీఆర్పీ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్త సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.


మృతి చెందిన వెంకటసాయిఅభిరామ్



మోటార్ సైకిల్ ఢీకొని రిటైర్డ్ ఉద్యోగి మృతి

గూడూరు రూరల్: పట్టణంలోని వివేకానంద రోడ్డులో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రెండో పట్టణ ప్రాంతానికి చెందిన విద్యుత్‌శాఖ రిటైర్డ్ ఉద్యోగి జనార్దన్‌రెడ్డి(65) మృతి చెందాడు. ఒకటో పట్టణ పోలీసుల వివరాల మేరకు.. గూడూరు ఒకటో పట్టణంలోని వివేకానంద రోడ్డులో నడిచి వెళుతున్న విశ్రాంత ఉద్యోగి జనార్దన్‌రెడ్డిని మోటార్ సైకిల్‌పై వెగంగా వెళ్తున్న ఓ యువకుడు ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో జనార్దన్‌రెడ్డికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రుడిని మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తీసుకెళ్తుండగా మార్గ మధ్యంలో మృతిచెందాడు. మృతునికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ప్రమాదానికి కారణమైన యువకుడిని ఒకటో పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.


మృతిచెందిన జనార్దన్‌రెడ్డి

మోటార్ వైర్లు, స్టార్టర్లు చోరీ

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కనమనంబేడు, గాజులపెళ్లూరు గ్రామాల్లోని వ్యవసాయ బోరు మోటార్లకు అమర్చిన వైర్లు, స్టార్టర్లను గుర్తు తెలియని దుండగులు చోరీ చేసినట్లు బాధిత రైతులు తెలిపారు. చోరీకి గురైన వస్తువుల విలువ సుమారు రూ.2 లక్షల వరకు ఉంటుందన్నారు. మూడు నెలల క్రితం కూడా ఇలానే చోరీలు జరిగాయని రైతులు వాపోతున్నారు.


మోటారు వైరు కట్ చేసిన దుండగులు

యువతి అదృశ్యంపై కేసు నమోదు

గుడిపాల: యువతి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌చార్జ్ ఎస్ఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు. గుడిపాల మండలంలోని అడవిచేను గ్రామానికి చెందిన ఓ యువతి గుడిపాలలోని నరహరిపేట జెడ్పీ హైస్కూల్‌లో ఇంటర్మీడియట్ చదువుతోంది. ఆదివారం సాయంత్రం ఆమె బాత్‌రూమ్‌కి వెళ్లి వస్తానని చెప్పి వెళ్లి ఇంటికి తిరిగిరాలేదు. అప్పటి నుంచి అన్ని చోట్ల వెతికినా ఎక్కడా దొరక్కపోవడంతో సోమవారం ఆమె తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. అయితే చిత్తపార గ్రామానికి చెందిన ఓ వ్యక్తిపై అనుమానం ఉన్నట్లు వారు ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

జాబ్‌మేళా సద్వినియోగం చేసుకోండి

చిత్తూరు కలెక్టరేట్: ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని విభిన్నప్రతిభావంతులు జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా విభిన్నప్రతిభావంతుల శాఖ ఏడీ శ్రీనివాస్ అన్నారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ తిరుపతి జిల్లా కేంద్రంలో ఉన్న ఎస్వీయూ ఎంప్లాయిమెంట్ ఆఫీస్ కాంపౌండ్ వద్ద ఈ నెల 11వ తేదీన జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ మేళాలో పాల్గొనే వారు పదో తరగతి ఉత్తీర్ణత చెంది, 18–30 ఏళ్లలోపు వయస్సు కలిగి ఉండాలని తెలిపారు. బధిరులు, అంధులు, శారీరక దివ్యాంగులు పాల్గొనవచ్చన్నారు. ఇతర వివరాలకు 93929 23884 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

వర్క్‌షాప్‌లతో సాంకేతిక పరిజ్ఞానం


రిటైర్డ్ ఐఏఎస్‌లు, విద్యార్థులతో విభాగాధిపతి ద్వివేది

ఏర్పేడు: వర్క్ షాప్‌లతో విద్యార్థులు శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాన్ని పొందవచ్చని ఐఐటీ తిరుపతి విభాగాధిపతి పీఎస్ ద్వివేది తెలిపారు. మండలంలోని మేర్లపాక రెవెన్యూలో ఉన్న తిరుపతి ఐఐటీ ప్రాంగణంలో సోమవారం డైరెక్టర్ కేఎస్.సత్యనారాయణ ఆధ్వర్యంలో «పబ్లిక్ పాలసీ ఇన్ ప్రాక్టీస్» అనే అంశంపై రెండు రోజుల వర్క్‌షాప్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఐఏఎస్ ఆఫీసర్లు సుబ్రమణ్యం, ఎస్ఎం విజయానంద, రాజీవ్‌సదానందన్, సీతారాం జనార్దన్‌కుంటే, ఆర్ఎస్ జులనియా, రిటైర్డ్ ఐపీఓఎస్ అధికారి సంధ్య, వీఎల్‌వీఎస్ ఎస్ సుబ్బారావు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి ఆర్డీఓ రామారావు బదిలీ

తిరుపతి అర్బన్: శ్రీకాళహస్తి ఆర్డీఓగా పనిచేస్తున్న కేఎస్ రామారావును విజయవాడ కనకదుర్గమ్మ ఆలయ ఈవోగా బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన స్థానంలో తిరుపతి ఆర్డీవో వి.కనక నరసారెడ్డికి అదనపు బాధ్యతలు అప్పగించినట్టు డీఆర్వో పెంచలకిషోర్ తెలిపారు.


కేఎస్ రామారావు

23న జాబ్ మేళా

నారాయణవనం: నియోజకవర్గ కేంద్రమైన సత్యవేడులో జరిగే జాబ్‌మేళాను మండలంలోని యువత సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ కృష్ణమూర్తి, ఏఓ గుణశేఖర్ తెలిపారు. సోమవారం వారు మీడియాతో మాట్లాడుతూ ఈనెల 23వ తేదీన రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సత్యవేడు పాలిటెక్నిక్ కళాశాలలో మెగా జాబ్‌మేళాను నిర్వహిస్తోందన్నారు. 8 నుంచి డిగ్రీ వరకు ఉత్తీర్ణులైన యువత ముందుగా 9440374535, 9154449677 నెంబర్లకు ఫోన్ చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ప్రముఖ 19 కంపెనీలలో 190 ఉద్యోగాల కోసం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు.

వైభవం..వరసిద్ధుడి పుష్పపల్లకీ సేవ

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి వార్షిక ప్రత్యేక ఉత్సవాల్లో భాగంగా సోమవారం వేకువజామున స్వామివారికి శాస్త్రోక్తంగా గ్రామోత్సవం నిర్వహించారు. ఆదివారం రాత్రి తెప్పపై విహరించిన దేవదేవరులను వేకువజామున సుగంధభరిత పుష్పాలతో అలంకరించిన పల్లకిలో కొలువుదీర్చి పురవీధుల్లో ఊరేగించారు. స్వామివారికి భక్తులు కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. దీంతో 21 రోజుల పాటు నిర్వహించిన స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు, ప్రత్యేక ఉత్సవాలు ముగిశాయి.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

సోమవారం స్వామివారి వార్షిక ప్రత్యేక ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం 10 గంటల వరకు ఆస్థాన మండపంలో కళాకారులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కళాకారులకు ఆలయ తాజా మాజీ చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశు ప్రశంసాపత్రాలు అందజేశారు.

రూ 1.28 లక్షలు పలికిన వరసిద్ధుడి లడ్డూ

కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామివారి లడ్డూ వేలంలో రూ.1.28 లక్షలు పలికింది. కాణిపాకం సమీపంలోని అగరంపల్లెకు చెందిన చరణ్‌రెడ్డి వేలంలో స్వామివారి లడ్డూను దక్కించుకున్నారు. స్వామివారి చెంత నైవేద్యంగా పెట్టిన 21 కిలోల లడ్డూను ప్రత్యేక ఉత్సవాల 21 రోజుల తరువాత వేలం వేయడం ఆనవాయితీ. ఈ క్రమంలో సోమవారం ఉదయం 11 గంటలకు స్వామివారి ఆస్థాన మండపంలో లడ్డూను వేలం వేయగా అగరంపల్లెకు చెందిన చరణ్‌రెడ్డి దక్కించుకున్నారు. ఆయనకు ఆలయ ఏఈఓలు రవీంద్రబాబు, విద్యాసాగర్‌రెడ్డి లడ్డూను అందజేశారు. ఈ కార్యక్రమాల్లో సర్పంచ్ శాంతిసాగర్ రెడ్డి, ఆలయ మాజీ చైర్మన్ జగన్నాథరెడ్డి, ఏఈఓలు ఎస్వీ కృష్ణారెడ్డి, హేమమాలిని, సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.


గ్రామోత్సవంలో విహరిస్తున్న దేవదేవరులు